సాక్షి
తిరుపతి
సోమవారం । 27 । మార్చి । 2023



తెప్పపై తేజోమయుడు

పిచ్చాటూరు : నాగలాపురంలోని వేదవల్లీ సమేత వేదనారాయణస్వామివారి సూర్యపూజ తెప్పోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి.

– వివరాలు 8లో



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: ఎలాంటి టికెట్లు లేని భక్తులకు తిరుమల శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో 26 కంపార్ట్ మెంట్లు నిండాయి.



30 నుంచి పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: ముక్కంటి ఈ నెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు పెద్దకొట్టాయి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ సాగర్‌బాబు ఆదివారం తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం(సా)	సహర్ మంగళవారం(ఉ)
తిరుపతి	6.27	4.52
చిత్తూరు	6.29	4.52
పుంగనూరు	6.31	4.56

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి జిల్లాస్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఈ క్రమంలో తిరుపతి ఆర్టీసీ సెంట్రల్ బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. అర్జీలు రాసేందుకు ముగ్గురు వీఆర్ ఓలను నియమించినట్లు తెలిపారు. ప్రతి సచివాలయంలో కూడా స్పందన కార్యక్రమం నిర్వహించాలని స్పష్టం చేశారు.

ఏప్రిల్ 1న బాలకాండ అఖండ పారాయణం

తిరుమల: లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఏప్రిల్ 1వ తేదీన 15వ విడత బాలకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నట్లు టీటీడీ ఆదివారం తెలిపింది. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుందని వెల్లడించింది. ఎస్వీ వేద వి/జ్ఞాన పీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, సంభావన పండితులు, అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొని మొత్తం 114 శ్లోకాలను పారాయణం చేయనున్నట్లు వివరించింది.

'సాగరమాల'కు భూసమస్య



రైతులతో సమావేశమైన అధికారులు (ఫైల్)

చిల్లకూరు : కేంద్రప్రభుత్వం చేపట్టిన సాగరమాల ప్రాజెక్టుకు భూసమస్య ఏర్పడింది. వివరాలు.. చిల్లకూరు మండలం వరగలి క్రాస్ నుంచి తూర్పు కనుపూరు వరకు సుమారు 36.65 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి రూ 964.24 కోట్లతో శ్రీకారం చుట్టారు. ఇందుకు గాను 12 గ్రామాలలో సుమారు 370 ఎకరాల వరకు భూములు సేకరించాల్సి ఉంది. ఆయా భూములను గుర్తించినప్పటికీ రైతులకు చెల్లించాల్సి పరిహారం విషయం ఓ కొలిక్కి రాలేదు. రెవెన్యూ అధికారులు ఎకరాకు రూ.11.30 లక్షలు మాత్రమే ఇస్తామని చెబుతుండడంతో రైతులు ముందుకు రావడం లేదు. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.40లక్షలు పలుకుతుంటే, తక్కువ మొత్తానికి భూములు ఎలా అప్పగిస్తామని రైతులు ప్రశ్నిస్తున్నారు.

హుషార్‌గా!

అంతరిక్ష పరిశోధనల్లో భారత దేశం ఖ్యాతి ఇనుమడించింది.. ప్రపంచదేశాల్లో తిరుగులేని శక్తిగా అవతరించింది.. వాణిజ్య ఉపగ్రహాల ప్రయోగంలో మరోసారి విజయకేతనం ఎగురవేసింది.. ఇస్రో బాహుబలిగా పేరుగాంచిన జీఎస్ఎల్‌వీ (ఎల్‌వీఎం–3– ఎం3) రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది.. నిర్ణీత సమయంలో నిర్దేశిత కక్ష్యలోకి సురక్షితంగా శాటిలైట్లను ప్రవేశపెట్టింది.. ప్రతిష్టాత్మక ప్రయోగం జయప్రదం కావడంతో షార్ శాస్త్రవేత్తల సంబరం అంబరాన్నంటింది. వీక్షించిన సందర్శకుల్లో హర్షాతిరేకం వ్యక్తమైంది.



శ్రీహరికోట రాకెట్ కేంద్రంలోని గ్యాలరీ నుంచి ప్రయోగాన్ని వీక్షిస్తున్న సందర్శకులు



- విజయవంతంగా ఎల్‌వీఎం3–03 ప్రయోగం
- నిర్దేశిత కక్ష్యలోకి చేరిన 36 ఉపగ్రహాలు
- ఫలించిన షార్ శాస్త్రవేత్తల కృషి
- ఇనుమడించిన ఇస్రో ఖ్యాతి

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఆదివారం ఉదయం 9.00.20 గంటలకు ఎల్‌వీఎం 3–ఎం3 ఉపగ్రహ వాహకనౌకను విజయవంతంగా ప్రయోగించింది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేషన్ లిమిటెడ్ వన్‌వెబ్ ఇండియా–2 పేరుతో 36 ఉపగ్రహాలు విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. కేవలం 97 నిమిషాల్లోనే భూమికి 450 కిలోమీటర్లు ఎత్తులోని లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో సురక్షితంగా ప్రవేశపెట్టింది. ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరు గాంచిన ఎల్‌వీఎం3–ఎం3 లాంటి భారీ రాకెట్‌ను కూడా వాణిజ్యపరమైన ప్రయోగాలకు ఉపయోగించడం ఇది రెండోసారి కావడం విశేషం. దీంతో ఎల్‌వీఎం3–ఎం3 రాకెట్ కూడా గ్లోబల్ కమర్షియల్ లాంచ్ సర్వీస్ మార్కెట్లోకి ప్రవేశించింది.

శాస్త్రవేత్తల సంబరం

ఆదివారం ఉదయం కౌంట్‌డౌన్ పూర్తి కావడంతో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. పెద్ద శబ్దంతో ఎల్‌వీఎం3–ఎం3 రాకెట్ నిప్పులు చిమ్ముతూ 5,805 కిలోలు బరువు కలిగిన వన్‌వెబ్ ఇండియా–2 పేరుతో 36 కమ్యూనికేషన్ ఉపగ్రహాలను మోసుకుని నింగికేగింది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసి మూడో దశలో అమర్చిన సీ–25 అంటే 25 టన్నుల క్రయోజెనిక్ ఇంధనం సాయంతో దూసుకెళ్లింది. రాకెట్ శిఖరభాగంలో అమర్చిన 36 ఉపగ్రహాలను నాలుగేసి ఉపగ్రహాల చొప్పున 9 సార్లుగా 97 (1.37 గంటల వ్యవధిలో) నిమిషాలకు దిగ్విజయంగా నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. ఎల్‌వీఎం3–ఎం3 రాకెట్ వరుసగా ఆరోసారి విజయం సాధించడంతో ఇస్రో శాస్త్రవేత్తల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

చప్పట్లు కొడుతూ.. ఈలలు వేస్తూ..

రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు మన రాష్ట్రంతోపాటు, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక నుంచి సుమారు పది వేలమందికి పైగా విచ్చేశారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు కార్లు, స్కూల్ వ్యాన్లు, బస్సులు పెద్దసంఖ్యలో బారులు తీరాయి. సందర్శకులు రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అనువుగా శ్రీహరికోటలో షార్ అధికారులు ఒక ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటు చేశారు. అలాగే పులికాట్ సరస్సు వద్ద రోడ్డుపై సైతం భారీగా జనం చేరుకున్నారు. రాకెట్ నింగిలోకి దూసుకెళుతుంటే ప్రజలు ఉత్సాహంగా చప్పట్లు, ఈలలతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

ఎల్‌వీఎం3–ఎం3 ప్రయోగాన్ని విజయవంతం కావడంపై ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఘనతను సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. వాణిజ్యపరమైన ప్రయోగాలు చేయడంలో మరోసారి సత్తాచాటారని కొనియాడారు. అలాగే శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సైతం రాకెట్ ప్రయోగంపై స్పందించారు. దేశ ప్రతిష్టను పెంచిన ఇస్రో చైర్మన్ కె.సోమనాథ్, షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్, శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. వాణిజ్యపరంగా ఇది ఘనవిజయమని ప్రశంసించారు.

దశలవారీగా ప్రయోగ క్రమం ఇలా..

- ఎల్‌వీఎం3–ఎం3 రాకెట్ 43.5 పొడవు కలిగి 643 టన్నులు బరువుతో నింగివైపుకు దూసుకెళ్లింది. 6 ఉపగ్రహాలను రోదసీలోకి మోసుకుని వెళ్లింది.
- మొదటి దశలో రాకెట్‌కు ఇరువైపులా అత్యంత శక్తివంతమైన ఎస్–200 బూస్టర్లు సాయంతో నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి బయలుదేరింది.
- రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో 400 టన్నుల ఘన ఇంధనాన్ని వినియోగించి 136.5 సెకన్లకు మొదటి దశను పూర్తి చేశారు.
- 185.5 సెకన్లకు రాకెట్ శిఖరభాగాన ఉపగ్రహాలకు అమర్చిన దశలో హీట్‌షీల్డ్స్ విజయవంతంగా విడిపోయాయి.
- ఎల్–110 అంటే 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని ఉపయోగించి 306.7 సెకన్లకు రెండోదశను పూర్తి చేశారు.
- సీ–25 అంటే 25 టన్నుల క్రయోజెనిక్ ఇంధనాన్ని వినియోగించి 933.1 సెకన్లకు మూడోదశను పూర్తి చేశారు.
- వన్‌వెబ్ ఇండియా– 2 పేరుతో అమర్చిన 36 ఉపగ్రహాలను క్రయోజెనిక్ దశతో 1174.6 సెకన్లకు భూమికి దగ్గరగా 450 కిలోమీటర్లు ఎత్తులోని లియో ఎర్త్ ఆర్బిట్‌లో 87.4 డిగ్రీల వంపుతో వృత్తాకార కక్ష్యలో మొదటిగా నాలుగు ఉపగ్రహాలను (1కే, 3కే, 5కే, 7కే) ప్రవేశపెట్టారు.
- 204.6సెకన్లకు మరో నాలుగు ఉపగ్రహాలు (2ఏ, 4ఏ, 6ఏ, 8ఏ) ప్రవేశపెట్టారు.
- 004.6 సెకన్లకు ఇంకో నాలుగు ఉపగ్రహాలు (1 ఏ, 3ఏ, 5ఏ, 7ఏ) ప్రవేశపెట్టారు.
- 2034.6 సెకన్లకు మరో నాలుగు ఉపగ్రహాలు (2బీ, 4బీ, 6బీ, 8బీ)ను ప్రవేశపెట్టారు.
- గంట పాటు గ్యాప్ తీసుకుని ముప్పై ఏడు నిమిషాల్లో మిగిలిన 20 ఉపగ్రహాలను నాలుగేసి చొప్పున విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.
- 1.37 (గంట ముప్పై ఏడు నిమిషాలకు) గంటలకు ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.
- ప్రయోగానంతరం యూకేకు చెందిన అంటార్కిటికా గ్రౌండ్‌స్టేషన్ వారు ఉపగ్రహాలను అధీనంలోకి తీసుకున్నారు. అన్నీ సక్రమంగా పనిచేస్తున్నట్టుగా సిగ్నల్స్ అందాయని ప్రకటించారు.





అంతరిక్షంలో దశలవారీగా కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెడుతున్న దృశ్యం

విద్యతోనే ఉన్నత సమాజం

తిరుపతి కల్చరల్ : విద్యలోనే ఉన్నత సమాజ నిర్మాణం సాధ్యమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతిలోని గిరిజన భవన్‌లో శంకర్ శాలినీ ఫౌండేషన్, ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో గిరిజన సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులతోపాటు జానపద కళల సంస్కృతి, సాంప్రదాయాల ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యతోనే మనిషికి విలువ, గౌరవం లభిస్తుందని చెప్పారు. బీఆర్ అంబేడ్కర్ విద్యాజ్ఞానంతోనే రాజ్యాంగ రచన చేయగలిగారని వెల్లడించారు. సమసమాజ స్థాపనకు మన మూలాలను కాపాడుకుంటూ, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలు అందించాలని సూచించారు. ప్రభుత్వం సైతం విద్యారంగం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. విప్లవాత్మకమైన పథకాలతో విద్యావ్యవస్థను ఉన్నతంగా తీర్చిదిద్దుతోందన్నారు. శంకర్ నాయక్ మాట్లాడుతూ 2015లో శంకర్ శాలిని ఫౌండేషన్ స్థాపించి గిరిజనులకు విద్య, నాగరికత, జీవనశైలిలో మార్పులకు శ్రమిస్తున్నామని తెలిపారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అనంతరం ప్రదర్శించిన జానపద సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్టీ సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, బీసీ సంక్షేమ, సాధికారత అధికారి భాస్కర్‌రెడ్డి, జిల్లా సమాచార శాఖ అధికారి బాలకొండయ్య, ఎస్వీయూ బోర్డు సభ్యుడు మల్లారపు మధు, నేతలు నాగరాజు, సోమశేఖర్ ఆచారి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు



నృత్య ప్రదర్శన

చిత్తశుద్ధితో పెండింగ్ కేసుల పరిష్కారం

చిత్తూరు అర్బన్ : పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులు చిత్తశుద్ధితో కృషి చేయాలని హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడంతోపాటు, రాజీ చేయలేని కేసులను కోర్టుల్లోనే పరిష్కరించాలన్నారు. అయిదేళ్లకు పైబడి పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా న్యాయమూర్తి భీమారావు, జడ్జిలు శాంతి, వెన్నెల, రవి తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఆర్అండ్‌బీ అతిథి గృహంలో హైకోర్టు జడ్జిని కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయశాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఉద్యోగుల సంఘ నాయకులు గోపీనాథ్‌రెడ్డి, రవిరెడ్డి తదితరులు కోరారు. అనంతరం జస్టిస్ మానవేంద్రనాథ్‌కు జ్ఞాపిక అందజేశారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

● ఆసరా.. ఆనందం



అక్కచెల్లెమ్మల్లో ఆనందం.. ప్రభుత్వ చేయూతపై సంబరం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కృతజ్ఞతాభావం ఉప్పొంగాయి. ఆదివారం తిరుపతిలో వైఎస్సార్ ఆసరా మూడోవిడత నగదు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి చేతులమీదుగా మెగా చెక్కును అందుకున్న మహిళల్లో సంబరాలు మిన్నంటాయి. – సాక్షి, తిరుపతి



పకడ్బందీగా పది పరీక్షలు

- ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం
- 152 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- హాజరుకానున్న 28,413 మంది విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి ఎడ్యుకేషన్ : పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు కొనసాగనున్న పరీక్షల కోసం మొత్తం 152 కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ప్రకటించారు. ల్లా వ్యాప్తంగా మొత్తం 26,673 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే 1,740 మంది ప్రైవేట్ విద్యార్థులు సైతం పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఇప్పటికే పరీక్షల నిర్వహణపై చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులకు కీలక సూచనలు చేశారు. పరీక్షల పర్యవేక్షణకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు.

మల్టీపుల్ జంబ్లింగ్ విధానంలో..

పారదర్శకంగా పదోతరగతి పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. మల్టీపుల్ జంబ్లింగ్ విధానంలో విద్యార్థులకు పరీక్ష కేంద్రాలను కేటాయించారు. అలాగే ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంచారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు ఇవ్వకుంటే కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు. చీఫ్ డిపార్ట్‌మెంట్ అధికారుల, ఇన్విజిలేటర్లతో సహా విద్యార్థులు ఎవరూ సెల్‌ఫోన్‌లను పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేకంగా కసరత్తు చేశామన్నారు. అందులో భాగంగా సబ్జెక్ట్ నిపుణులతో రూపొందించిన విజయసాధన పుస్తకాలను విద్యార్థులకు అందించామని తెలిపారు. అలాగే సాయంత్ర వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వహించి పిల్లలను సన్నద్ధం చేసినట్లు వెల్లడించారు.



ఉత్తమ ఫలితాలకు విద్యావేత్తల సూచనలు

- విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చదువుకోవాలి. తల్లిదండ్రులు సైతం పిల్లలను టెన్షన్ పెట్టకూడదు. స్వేచ్ఛగా చదువుకునేలా ప్రోత్సహించాలి.
- ముందుగా భయాన్ని విడనాడాలి. ఒత్తిడిని జయించాలి. ఇందుకోసం రోజూ పది నిముషాల పాటు ధ్యానం చేయడం మంచిది.
- అలాగే రాత్రింబవళ్లు చదవడం కూడా శ్రేయస్కరం కాదు. తగినంత విశ్రాంతి లేకుంటే నేర్చుకుంది మర్చిపోయే ప్రమాదముంది. రాత్రి పది గంటలకల్లా నిద్రపోవాలి. వేకువజామునే లేచి చదువుకోవాలి.
- పరీక్షలు దగ్గర పడినందున ఇకపై కొత్తవి చదువుకోవడం కాకుండా, ఇప్పటి వరకు నేర్చుకున్న పాఠ్యాంశాలను రివిజన్ చేసుకునేందుకు ప్రాధాన్యమివ్వాలి.
- సెల్‌ఫోన్ వినియోగాన్ని పక్కనపెట్టాలి. స్నేహితులతో కాలక్షేపం చేస్తూ సమయాన్ని వృథా చేసుకోవడం మంచిది కాదు.
- ఉత్తమ మార్కులు సాధించేందుకు అన్ని సబ్జెక్టులకు ప్రాధాన్యమివ్వాలి. ఏకాగ్రతతో ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి.
- ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి. బయట ఆహారం తీసుకోకపోవడం మంచిది. పరీక్ష సమయంలో జ్వరం తదితర రోగాల బారిన పడకుండా చూసుకోవాలి.
- తల్లిదండ్రులు సైతం పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. కాఫీలు, టీలు తగ్గించాలి. మజ్జిక, పళ్లరసాలు సేవించాలి. ఆయిల్ ఫుడ్‌కు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి.
- పరీక్షకు వెళ్లేప్పుడు పెన్నులు, పెన్సిళ్లు మర్చిపోకుండా తీసుకెళ్లాలి. జవాబు పత్రాల్లో కొట్టివేతలు లేకుండా రాసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అక్షర దోషాలు లేకుండా చక్కగా రాసేందుకు యత్నించాలి. క్రమ పద్ధతిలో సమాధానాలు రాయాలి. ఏ ప్రశ్నకి ఏ జవాబు రాశామో పేపర్ దిద్దే అధ్యాపకులకు అర్థమయ్యేలా నీట్‌గా పొందుపరచాలి.

ఒత్తిడిని జయించాలి



పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయించాలి. చక్కగా చదువుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలి. పాఠశాలలో రాసినట్టుగానే పబ్లిక్ పరీక్షలు కూడా ఉంటాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. అలాగే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించాం. ఆయా కేంద్రాల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాం.

– వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి

పక్కాగా ఏర్పాట్లు



పదో తరగతి పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారుల సహకారంతో వసతులు కల్పించాం. పరీక్షల నిర్వహణకు అవసరమైన సీఎస్, డీఓ, ఇతర అధికారులు, స్క్వాడ్ బృందాలను నియమించాం. ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

– శేఖర్, డీఈఓ, తిరుపతి

29న ఆరుద్ర పూజలు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలో ఈ నెల 29వ తేదీన ఆరుద్ర పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఊరందూరులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చంద్రగిరి : పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. పాకాల మండలం దామలచెరువు పంచాయతీ పూలశెట్టివారిపల్లెకు చెందిన జ్యోతి కుమార్, భార్గవి (40) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఉండగా బోడంబావి వద్ద కారు ఢీకొంది. క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భార్గవి మరణించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ఎర్రావారిపాళెం : మండలంలోని తొప్పిరెడ్డిగారిపల్లె వద్ద బిగ్ చెరువులో పడి ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. చిన్నగొట్టిగల్లు మండలం నల్లఓబులవారిపల్లెకు చెందిన సురేష్ (37)చెరువులో దిగాడు. ప్రమాదవశాత్తు చెరువులోని గుంతలో ఇరుక్కుపోయి మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలే వైఎస్సార్‌సీపీ బలం.. బలగం



సమావేశానికి భారీగా హాజరైన మహిళలు



చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

- జనం గుండెల్లో జగనన్న ఉన్నారు
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా
- 14.468 మందికి రూ.15.51 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

నగరి : మహిళలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం బలగం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ భారీ బహిరంగ సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నగరి మునిసిపల్, మండల పరిధిలో లబ్ధిదారులైన 14,468 మంది మహిళలకు రూ.15.51 కోట్ల చెక్కును ఆమె అందజేశారు. తోబుట్టువులా తమను ఆదుకుంటున్నారంటూ మహిళలు మంత్రితో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్‌చేసి మంత్రికి తినిపించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తకంగా 78.94 లక్షల మంది మహిళలకు ఆసరా 3వ విడత ద్వారా రూ. 6419.89 కోట్లు ప్రభుత్వం అందిస్తోందన్నారు. నగరి నియోజకవర్గ పరిధిలో 44,750 మందికి రూ.46.3 కోట్లు ఆసరా 3వ విడతలో అందిస్తున్నట్లు వివరించారు. ఆసరా, సున్నా వడ్డీ రుణాలు, చేయూత, జగనన్న తోడు, బ్యాంకు లింకేజీ, జగనన్న ఇళ్ల పథకాలతో మహిళలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. ఒక్క నగరి మున్సిపాలిటీలోనే ఇప్పటి వరకు ఈ పథకాల ద్వారా 55,236 మంది మహిళలకు రూ.187.56 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. మహిళలు గత పాలనలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు కనుకే ఎన్నికల సమయంలో మభ్యపెట్టడానికి పసుపుకుంకుమ ఇచ్చిన చంద్రబాబుకు మహిళలు ఉప్పు, కారం పెట్టి సాగనంపారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ ప్రతి పథకం మహిళల పేరిటే అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా మహిళలకు ఇంతటి ప్రాధాన్యం ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. మహిళా ముఖ్యమంత్రులు పాలించే రాష్ట్రాల్లోనే మహిళలకు ఇంతటి ప్రాధాన్యత లేదన్నారు. అందుకే నేడు ప్రతి మహిళా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని అన్నదమ్ముడిలా, కొడుకులా, మనవడిలా తన గుండెల్లో పెట్టుకుంటున్నట్లు చెప్పారు. మనసున్న ముఖ్యమంత్రి తమను పాలిస్తున్నాడని, తాను మంచి వ్యక్తికి ఓటు వేశానని ప్రతి మహిళ నేడు గర్వపడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుజన, మెప్మా పీడీ రాధమ్మ, మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, మునిసిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీ భార్గవి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్, మునిసిపల్ వైస్‌చైర్మన్ వెంకటరత్నం, వైస్ ఎంపీపీ కన్నియప్ప, మెప్మా అధికారి సునీత, పీఏసీఎస్ చైర్మన్ తిరుమల రెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.55,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	25
తిరుమల	32	21
చిత్తూరు	37	24
గూడూరు	37	26
నగరి	38	26

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుల చేరిక



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలం, శివనాథపురం గ్రామానికి చెందిన 30 టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. శివనాథపురం సర్పంచ్ ఎం.ఆర్.రాజా ప్రకాష్, మాజీ టీడీపీ నాయకులు ఉద్దండి ఆర్ముగం, పూడి హరియాదవ్, పూడి గోపాల్‌యాదవ్ ముత్తు, విజ్జి, మురుగన్, శరత్, ఏలుమల్లై, దినేష్, శరవణన్, రవీంద్రన్, ఈశ్వరన్, ప్రతిభన్, అన్నామలై, బాల, కృష్ణమూర్తి, ప్రతాప్, రాజలింగం, ప్రకాశం, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

- మండల మీట్‌ను బహిష్కరించిన ప్రజాప్రతినిధులు



ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ : అధికారుల తీరుపై మండల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, ఇష్టానుసారం నిధులు ఖర్చుపెడుతున్నారని, ప్రొటోకాల్‌ను పాటించడం లేదని ఆరోపించారు. అధికారుల వైఖరికి నిరసనగా మండల మీట్‌ను బహిష్కరిస్తున్నామని ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీలు మునికృష్ణారెడ్డి, మునెమ్మతోపాటు నలుగురు ఎంపీటీసీ సభ్యులు, 10 మంది సర్పంచ్‌లు వెళ్లిపోయారు. దీంతో కంచనపుత్తూరు ఎంపీటీసీ సభ్యులు కారణి చందన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను అగౌరవపరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందించేందుకు కృషి చేయాలని సూచించారు. వ్యవసాయాధికారి భారతి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను అందిస్తున్నామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలిమ మాట్లాడుతూ 37 గ్రామాలకు ఓవర్‌హెడ్ ట్యాంకులు మంజూరైనట్లు వెల్లడించారు. సమావేశంలో పీఆర్ ఏఈ నాగరాజు, డీటీ శివయ్య, కో–ఆప్షన్ మెంబర్ ఇమామ్‌బాషా పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేస్తున్న పాలకమండలి సభ్యులు

చిల్లకూరు: తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఆలయంలో అట్టహాసంగా సాగింది. నూతనంగా ఎంపికైన పాలకమండలి సభ్యుల చేత ఆలయ ఈఓ నవీన్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎక్స్ అఫిషియో మెంబర్‌తో కలిపి మొత్తం 10 మంది చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ పాలక మండలి చైర్‌పర్సన్‌గా గూడూరుకు చెందిన సిద్దారెడ్డి ఇంద్ర శీనారెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే శ్రీనివాసులు(కోట), చిల్లకూరు వెంకటేశ్వరమ్మ, దువ్వూరు సాయికృష్ణారెడ్డి(దొరువు కట్ట), ఎల్లసిరిపుష్పలత(నల్లాయగారిపాళెం), దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి(బల్లవోలు), ఉప్పాల ప్రభాకర్(కొత్తపట్నం), భాను బాలాజీ (వంజివాక), పర్వతాల విమల(కాకులారిపాళెం)తోపాటు ఆలయ అర్చక చాకిరీ రమణయ్య ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొవడలూరు దామోదర్‌రెడ్డి, యరటపల్లి జానకీరామిరెడ్డి, దువ్వూరు కృష్ణారెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, ఉప్పల ప్రసాద్‌గౌడ్, జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, ఎంపీటీసీ జానకీరాం, కిరణ్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యతేజం.. చంద్ర దరహాసం





సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు, చంద్రప్రభ వాహనంపై శ్రీరామచంద్రమూర్తి

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఏడో రోజు ఆదివారం ఉదయం స్వామివారు శంఖు, చక్రాలు, విల్లు, బాణం, గధ, ఖడ్గం, పంచాయుధాలను ధరించి సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు హారతులు సమర్పించారు. అనంతరం స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. రాత్రి స్వామి వారి చంద్రప్రభ వాహన సేవ వైభవంగా సాగింది. పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, డిప్యూటీ ఈఓ నాగరత్నం, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్, కంకణభట్టర్ ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి పాల్గొన్నారు.

బంగారు గొడుగు ఉత్సవం

సోమవారం నిర్వహించనున్న స్వామి వారి రథోత్సవాన్ని పురస్కరించుకొని బంగారు గొడుగు ధర్మకర్త పంతులుగారి వంశానికి చెందిన పంతులుగారి రామనాథన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బంగారు గొడుగు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బంగారు గొడుగుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు.

ఫైనాన్స్ కంపెనీలో చోరీ

తిరుపతి క్రైమ్: నగరంలోని తిరుమల బైపాస్ రోడ్డులోని ఓ ఫైనాన్స్ కంపెనీలో చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. క్రైమ్ పోలీసుల కథనం.. తిరుమల బైపాస్ రోడ్డులోని మూడవ అంతస్తులో స్టార్ బిజినెస్ ఫైనాన్స్ నిర్వహిస్తున్నారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి షట్టర్ తాళాలు పగలగొట్టి అందులో ఉన్న రూ.7.3లక్షలను దోచుకెళ్లారు. ఆదివారం బ్రాంచ్ మేనేజర్ జయప్రకాష్ కార్యాలయానికి వెళ్లి చూడగా షట్టర్ పగలగొట్టి ఉంది. వెంటనే డయల్ 100కు ఫిర్యాదు చేయగా.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించి కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యానికేతన్ విద్యార్థులు



మాన్యసాయి, ధన్యశ్రీ

తిరుపతి అలిపిరి : గూడురులో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–17 చెస్ పోటీల్లో రంగంపేట విద్యానికేతన్ విద్యార్థులు మాన్యసాయి, ధన్యశ్రీ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు అన్నాచెల్లెలు కావడం విశేషం. తల్లిదండ్రులు డాక్టర్ కె.భువింధర్, డాక్టర్ స్వాతి ప్రోత్సాహంతోనే ముందుకు సాగుతున్నట్లు విద్యార్థులు తెలిపారు.

తెప్పపై తేజోమయుడు



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న లక్ష్మణ సమేత సీతారాములు



ముత్యపు పందిరి వాహనంపై..

పిచ్చాటూరు: నాగలాపురంలోని శ్రీవేదనారాయణ స్వామి సూర్యపూజ తెప్పోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ మూర్తులు తెప్పపై విహరిస్తూ కనువిందు చేశారు. అంతకుముందు మత్స్యమూర్తిగా వెలసిన శ్రీ వేద నారాయణస్వామి పాదాలపై స్పృశించాల్సిన సూర్య కిరణాలకు మబ్బులు అంతరాయం కలిగించాయి. ఉదయం స్నపన తిరుమంజనాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణస్వామి ఉత్సమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ముత్యపు పందిరి వాహనంపై ఆశీనులు చేసి పుష్కరిణికి వేంచేపు చేశారు. పుష్కరిణిలోని తెప్పపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు చేసి తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను తిరువీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. చివరిగా రాత్రి నిజాలయంలో శ్రీ వేదనారాయణుడికి ఏకాంత సేవ నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ అధికారి పర్యవేక్షించగా, నాగలాపురం, సత్యవేడు, పిచ్చాటూరు ఎస్‌ఐలు హనుమంతప్ప, పురుషోత్తంరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు.

డ్రిప్ సాగు.. భలే బాగు

జిల్లాలో డ్రిప్‌సాగు(బిందుసేద్యం) విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. నీటి పొదుపు, అధిక దిగుబడి, ఆదాయం పొందేందుకు ఈ బిందు సేద్యంపై రైతులు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో అత్యధికంగా సాగవుతున్న ఉద్యానవన పంటల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు, మల్చింగ్ షీట్ వంటి ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ రైతులు లాభాల బాట పడుతున్నారు. ప్రభుత్వం రాయితీలతోపాటు కంపెనీని ఎంచుకునే అవకాశం కల్పించడం రైతులకు వరంగా మారింది. 2022–23కు జిల్లాలో ఐదువేల హెక్టార్లలో డ్రిప్, ఇతర పరికరాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

- నీటి పొదుపు.. ఎక్కువ దిగుబడి
- ఉద్యానపంటలకు అధిక వినియోగం
- రైతులకు భారీగా సబ్సిడీ సాయం
- నచ్చిన కంపెనీని ఎంచుకునేలా రైతులకు అవకాశం కల్పించిన ప్రభుత్వం
- డిమాండ్‌కు తగినట్లు డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లు అందజేత



సాక్షి, చిత్తూరు: చిత్తూరు జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం ఎక్కువగా ఉంది. సుమారు లక్ష హెక్టార్లకు పైగా ఉద్యాన పంటలు సాగు చేసి రైతులు ఆదాయం పొందుతున్నారు. ప్రధానంగా మామిడి, టమాట, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బీన్స్, వంగ, బెండతోపాటు ద్రాక్ష పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. అత్యధికంగా మామిడి సుమారు 60 వేల హెక్టార్లలో సాగులో ఉంది.

నచ్చిన కంపెనీ ఎంపిక

ప్రభుత్వం ఎక్కువ కంపెనీలకు అవకాశం ఇచ్చి డ్రిప్ పరికరాలను అందజేసేలా పర్యవేక్షిస్తోంది. నాణ్యతను పెంచుకోవడం కోసం ప్యాక్ హౌసులు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసుకునేందుకు రాయితీ ఇస్తోంది. స్ప్రేయర్లు, ఆధునిక యంత్ర సామగ్రిని సరఫరా చేస్తోంది. టమాటా సాగుకు సంబంధించి చిన్న తరహా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, రవాణా వాహనాలు అందజేస్తోంది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, ఆంధ్రప్రదేశ్ సమీకృత నీటిపారుదల, వ్యవసాయ పరివర్తన పథకం, నీటిపారుదల జీవనోపాధుల అభివృద్ధి ద్వారా జిల్లాలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేస్తున్నారు. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి రాయితీపై పరికరాలను ఇస్తున్నారు.

5వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలు

వంద శాతం మైక్రో ఇరిగేషన్ లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నారు. 2022– 23 సంవత్సరంలో జిల్లాలో ఐదువేల హెక్టార్లలో డ్రిప్, ఇతర పరికరాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులకు 90 శాతంతో 2.18 లక్షల రాయితీతో పరికరాలు అందిస్తున్నారు. ఐదు నుంచి పది ఎకరాల వరకు కలిగిన రైతులకు 70 శాతంతో రూ.3.46 లక్షల రాయితీతో పరికరాలను అందిస్తున్నారు. సన్న చిన్న కారు రైతులకు 55 శాతంతో స్ప్రింక్లర్ పరిక రాలు, ఐదు నుంచి పది ఎకరాల రైతులకు 45 శాతంతో పరికరాలను అందిస్తున్నారు. ఇప్పటికే 15 వేల హెక్టార్లకు పైగా రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తు ఇలా

జిల్లాలో 16 కంపెనీలకు చెందిన డ్రిప్, అనుబంధ పరికరాలు అందిస్తున్నారు. ఆన్‌లైన్‌లో రైతులు చేసుకున్న దరఖాస్తులను కలెక్టర్ అనుమతి పొందిన తర్వాత డ్రిప్ ఏర్పాటు చేసే (ఇన్సులేషన్) కంపెనీకి పంపుతారు. అనంతరం కంపెనీ ప్రతినిధితో పాటు హార్టికల్చర్ అసిస్టెంట్ పరిశీలించి సర్వే చేస్తారు. అంచనాలకు సంబంధించి సబ్సిడీ రుణం పోను మిగతా సొమ్ము ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లిస్తారు. తర్వాత 15 రోజుల్లోపు పరికరాలు అమర్చుతారు. 2022–2023లో 6,512 మంది రైతులకు రూ. 61.80 కోట్ల విలువైన డ్రిప్ పరికరాలు అందించారు. 5,719 హెక్టార్లలో పంటలు సాగులోకి తీసుకొచ్చారు. రైతులు రూ.51.37 కోట్ల సబ్సిడీ పొందారు.